అందరికీ సమాన న్యాయం

గన్నవరం: స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మంగళవారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి బి. శిరీష మాట్లాడుతూ.. పేద, ధనిక తారతమ్యాలు లేకుండా అందరికీ సమాన న్యాయం అందించడమే న్యాయస్థానాల బాధ్యత న్నారు. ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు న్యాయవిజ్ఞాన సదస్సులను నిర్వహిస్తు న్నామన్నారు. సమాజంలోని అసమానతలను, రూపుమాపేందుకు అందరూ కలిసికట్టుగా పనిచే యాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరివీధి వెంకయ్య కోరారు. న్యాయవాదులు వైఆర్ఎస్ శారద, స్వామి, ప్రకాష్, వీరబాబు పాల్గొన్నారు.

●నిస్వార్థ ప్రజా సేవకులు వలంటీర్లు





నిస్వార్థ ప్రజా సేవకులు వలంటీర్లు అని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ అన్నారు. పెనమలూరు, కంకిపాడు పరిధిలోని వలంటీర్లకు మంగళవారం పురస్కారాలు అందజేశారు.
– కంకిపాడు/పెనమలూరు

వీరమ్మతల్లి.. చల్లంగ చూడమ్మా



ఉయ్యూరు: వీరమ్మతల్లి గ్రామోత్సవం వైభవంగా ముగిసింది. జై వీరమ్మ.. జై జై వీరమ్మ.. అంటూ భక్త జన నామస్మరణ నడుమ అమ్మవారు పల్లకిలో ఊరేగి అశేష భక్తజన పూజలందుకున్నారు. ఇంటింటా అమ్మవారికి హారతులు పట్టి పసుపు నీరు ఓరబోసి మొక్కులు చెల్లించుకున్నారు. పల్లకిపై భక్తులు పూలవర్షం కురిపించారు. గ్రామోత్సవం అనంతరం ప్రధాన సెంటరులో ఊయల ఊగి ఆలయ ప్రవేశం చేశారు.

సంక్షిప్త వార్తలు

■ నేడు ప్రసాదంపాడులో వలంటీర్లకు వందనం

రామవరప్పాడు: ప్రసాదంపాడులోని అన్నపూర్ణ రైస్‌మిల్లు ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు మండల స్థాయిలో వలంటీర్లకు వందనం, మధ్యాహ్నం వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు కాకర్లమూడి సువర్ణరాజు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ హాజరై వలంటీర్లను సత్కరిస్తారని, డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందిస్తారని తెలిపారు.

■ ఉత్తమ ఫలితాలే అందరి లక్ష్యం కావాలి

కంకిపాడు: ఉత్తమ ఫలితాల సాధనే అందరి లక్ష్యం కావాలని డీఈఓ తాహెరా సుల్తానా అన్నారు. మండలంలోని పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో మంగళవారం ఆంగ్లం, భౌతిక శాస్త్రాల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి డీఈఓ తాహెరా సుల్తానా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయా పాఠ్యాంశాల్లో ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. పాఠశాలల నిర్వహణ, బోధనాపద్ధతుల అనుసరణను తనిఖీ చేశారు. సమగ్ర శిక్ష ఏఎంఓ ఆర్.శ్యామ్, ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్, హెచ్‌ఎం ఏ.వెంకటేశ్వరరావు, కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా విద్యాసాగర్

గన్నవరం: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గన్నవరానికి చెందిన దేవరపల్లి విద్యాసాగర్ నియమితులయ్యారు. ఇటీవల భీమవరంలో జరిగిన ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు విద్యాసాగర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా కీలక బాధ్యతలు అప్పగించినందుకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయిశ్రీనివాస్, రఘునాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

■ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించాలి

ఉయ్యూరు: వినియోగదారులకు మెరుగైన సేవలు అందించి బాధ్యతతో విధులు నిర్వర్తించాలని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్ సూచించారు. స్థానిక డివిజన్ కార్యాలయంలో విద్యుత్ శాఖ కార్మిక సంఘాల ప్రతినిధులు మంగళవారం సమావేశమయ్యారు. గ్రామాల్లో విద్యుత్, ఉద్యోగుల సమస్యలపై సమీక్షించారు. కృష్ణనాయక్ మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీరమ్మతల్లి తిరునాళ్ల పూర్తయ్యే వరకూ ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్మిక సంఘాల నాయకులు చెప్పిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఉత్తమ సేవలు అందించటం ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావటంతో పాటుగా ప్రజల మన్ననలు పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా ఈఈ కృష్ణనాయక్‌ను సంఘ నాయకులు సత్కరించారు. సమావేశంలో యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, రాజు, మోహన్‌రావు, సుబ్బారావు, గోవర్ధన ప్రసాద్, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

■ జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు భరోసా

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో ప్రజల ఆరోగ్యానికి భరోసా ఏర్పడుతుందని ఎంపీడీఓ కుమార్‌బాబు తెలిపారు. పెదపులిపాక గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అనేక చర్యలు చేపట్టిందన్నారు. 108, 104, ఫ్యామిలీ డాక్టర్, గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, ఆరోగ్యశ్రీ పథకాలు అమలు చేపట్టిందని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని వైద్య సేవలు అందించటానికి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామ సర్పంచ్ గుంటూరు శ్రీనివాసా చౌదరి మాట్లాడుతూ.. సీఎంగా జగనన్న అధికారం చేపట్టిన తరువాత ప్రజారోగ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షలకు పెంచి పేదలకు అండగా నిలిచారని తెలిపారు. జగనన్న పాలనలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి బిజిలి శ్రీనివాస్, ఏఓ లోయ శివశంకర్, ఈఓ పద్మావతిదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

■ ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి

విజయవాడరూరల్: ఇంటి పన్ను వసూలును అధికారులు, సిబ్బంది వేగవంతం చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి కె.శ్రీనివాసరావు ఆదేశించారు. విజయవాడలోని డీఎల్‌పీఓ కార్యాలయంలో ఇంటి పన్ను వసూలుపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. విజయవాడ రూరల్ మండలంలో 18 కోట్ల రూపాయలకు గాను 8 కోట్ల రూపాయలు మాత్రమే వసూలు చేశారన్నారు. ఈ నెల 26వ తేదీ నాటికి 70 శాతం ఇంటి పన్ను వసూలు చేయాలన్నారు. పాత బకాయిల వసూలుపై శ్రద్ధ చూపాలని చెప్పారు. ఈఓఆర్డీ బీఎల్‌వీ శేషగిరిరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

■ ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీసీతారామలక్ష్మణస్వామివార్ల దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారిని విశేషంగా అలంకరించి, హోమం, ప్రత్యేక పూజలు చేపట్టారు. బుధవారం ఆలయంలో పూర్ణాహుతి, చక్రస్నానం, పవళింపు సేవ నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పెనమలూరు సొసైటీ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

■ మామిడిలో పురుగుల నివారణకు చర్యలు

విజయవాడరూరల్: మండలంలోని మామిడి తోటల్లో ప్రస్తుతం తేనే మంచు, తామర పురుగులు కనిపిస్తున్నాయని మండల ఉద్యాన శాఖాధికారి పెద్దిరెడ్డి పరమేశ్వరరెడ్డి తెలిపారు. నున్న, పాతపాడు, కొత్తూరు.తాడేపల్లి గ్రామాల్లోని మామిడి తోటలను ఉద్యాన శాఖాధికారి పరమేశ్వర రెడ్డి, ఉద్యాన సహాయకులు ఫైజ, శ్యామ్, రైతులతో కలిసి మంగళవారం పరిశీలించారు. తేనే మంచు, తామర పురుగులు మామిడి తోటలను ఆశించాయని, పురుగుల నివారణ చర్యలను రైతులు వెంటనే చేపట్టాలని సూచించారు.

■ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. ఈడుపుగల్లు సెంటరులో విజయవాడ-మచిలీపట్నం హైవే వెంబడి ఈనెల 13న ఓ వృద్ధుడు(60) గాయాలతో పడి ఉండటాన్ని గుర్తించిన ఈడుపుగల్లు వీఆర్వు చైతన్య 108 అంబులెన్సులో వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. మృతుడి పేరు జి.వెంకటేశ్వరరావుగా గుర్తించారు. గోసాల, కంకిపాడు ప్రాంతాల్లో బిక్షాటన చేస్తూ జీవిస్తున్నట్లు నిర్ధారించారు. ఆస్పత్రి వర్గాల సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

■ శ్రీలక్ష్మీతిరుపతమ్మకు లక్ష పుష్పార్చన

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఈ నెల 23న జరగనున్న అమ్మవారి వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని జరుగుతున్న మండల దీక్ష పారాయణం మంగళవారం 39వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సాయంత్రం శ్రీలక్ష్మీతిరుపతమ్మకు లక్ష చామంతులతో పుష్పార్చన నిర్వహించారు. భీష్మ ఏకాదశి సందర్భంగా భక్తులచే విష్ణు సహస్రనామ పారాయణం జరిపారు. వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం ఉత్సవమూర్తులకు అభిషేకం, కోలాట ప్రదర్శన జరపనున్నట్లు ఆలయ అధ్యక్షుడు శ్రీధర్ తెలిపారు.

■'టీడీపీలో చేరింది వైఎస్సార్ సీపీ నాయకులు కాదు'

అంబాపురం(విజయవాడరూరల్): టీడీపీలో చేరింది వైఎస్సార్ సీపీ నాయకులు కాదని, ఆ ముసుగులో పోలవరం మట్టి దోచుకున్న అక్రమార్కులని వైఎస్సార్ సీపీ అంబాపురం గ్రామ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్, కో కన్వీనర్ తోడేటి బెంజిమెన్, గన్నవరం నియోజకవర్గం నాయకులు సీమయ్య తెలిపారు. అంబాపురం గ్రామ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబాపురం గ్రామ సర్పంచ్ గండి కోట సీతయ్య, అధికారం చేపట్టిన నాటి నుంచి దళిత వ్యతిరేకిగా పరిపాలన చేస్తూ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న దళిత పారిశుద్ధ్య కార్మికులను హింసించి, తొలగించాడన్నారు. దళిత వ్యతిరేకిగా ముద్రపడిన సీతయ్య, క్రిస్టమస్ పండుగ సందర్భంగా గ్రామంలో జరిగిన గొడవతో పండుగ వాతావరణానికి భంగం కలిగించాడరన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు టీడీపీలో చేరానని చెప్పుకోవడం సిగ్గుచేటని, పెత్తందార్లకు, పేదలకు మధ్య జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి బుద్ధి చెబుతారన్నారు. పి.నైనవరం గ్రామానికి చెందిన దేవేంద్రరావు కోట్లాది రూపాయల పోలవరం మట్టి అక్రమ వ్యాపారం చేయడానికి వైఎస్సార్ సీపీ ముసుగు వీరుడిగా వ్యవహరించాడని చెప్పారు.

■ ఘనంగా పిన్నమనేని సిద్ధార్థ గ్రాడ్యుయేషన్ డే

గన్నవరంరూరల్: వైద్యులు రోగులకు చిరునవ్వుతో వైద్య సేవలందించాలని జీఎస్ఎల్ ట్రస్ట్ క్యాన్సర్ హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ గన్ని భాస్కర రావు చెప్పారు. చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో మంగళవారం రాత్రి 18వ బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులు 152 మందికి, 13వ బ్యాచ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు 86 మందికి, ఇద్దరు సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ఆయన కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావుతో కలిసి డిగ్రీలు ప్రదానం చేశారు. సిద్ధార్థ అకాడమీ సెక్రటరీ పాలడుగు లక్ష్మణరావు, ట్రెజరర్ సూరెడ్డి వెంకటేశ్వరరావు, ఎస్.లలిత ప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ సీవీరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్, హెచ్ఓడీలు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

■ పార్థీవదేహం మెడికల్ కళాశాలకు అందజేత

విస్సన్నపేట: స్థానిక కాకతీయ కమ్మ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు, ప్రముఖ కాంట్రాక్టర్ చలసాని వెంకటేశ్వరరావు సతీమణి విజయలక్ష్మి (73) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి తదితరులు విజయలక్ష్మి మృతదేహం వద్ద నివాళులర్పించారు. విజయలక్ష్మి పార్థీవ దేహాన్ని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు మంగళవారం కుటుంబ సభ్యులు అందజేశారు.

■ 11 మంది జూదరుల అరెస్ట్

కంకిపాడు: పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన వివరాల మేరకు.. గొడవర్రులోని ఓ ఇంటిలో పేకాట శిబిరం నడుపుతున్నట్లు సమాచారం అందటంతో సిబ్బందితో కలిసి దాడి చేశారు. దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.57,250 నగదు, ఆరు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

పెనమలూరు: వణుకూరు గ్రామ పరిధిలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురు జూదరులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వణుకూరులో కోడిపందేలు ఆడుతున్నారని ఎస్ఈబీ అధికారులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడి చేయగా కోడిపందేలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రెండు పుంజులు, రెండు కత్తులు, ఒక బైక్, రూ.1,010 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

■ రామవరప్పాడు: రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ పరమేశ్వరరావు మంగళవారం తెలిపారు.

■ భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం సామూహిక వ్రతాలను వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని వెంకటేశ్వరస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు నేతృత్వంలో సామూహిక వ్రతం, విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు, అరుణ దంపతులు వ్రతంలో పాల్గొన్న భక్తులకు ఉచితంగా పూజా సామగ్రిని పంపిణీ చేశారు.

■ ఘనంగా శివ జయంతి వేడుకలు

గన్నవరం: స్థానిక రాయ్‌నగర్‌లోని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శాఖ కేంద్రంలో మంగళవారం శివ జయంతి వేడుకలు నిర్వహించారు. శివ జయంతి సందర్భంగా కేక్ కటింగ్‌తో పాటు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయవాడ కేంద్రం నిర్వాహకురాలు బీకే. భారతి మాట్లాడుతూ.. ధర్మ స్థాపనకై పరంజ్యోతి పరమాత్మ అవతరించారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు, బ్రహ్మకుమారిలు రత్నకుమారి, మణి, శిరీష కంచన్, అలపాటి భీమరావు పాల్గొన్నారు.

■ రేపటి నుంచి అంకమ్మ తల్లి తిరునాళ్ల

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం బిళ్లనపల్లిలో ఈ నెల 22వ తేదీ నుంచి అంకమ్మ తల్లి తిరునాళ్లు మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు కొండపావులూరి వెంకట బాబురావు, తులసీ రాంప్రసాద్, మోహన్‌కుమార్, హేమంత్‌కుమార్‌లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రతి రోజు ఉదయం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, సాయంత్రం భజనలు, రెండో రోజున గ్రామోత్సవం జరుగుతుందన్నారు. చివరి రోజున అమ్మవారి మొక్కులు చెల్లించుకునేందుకు పాల పొంగళ్లు, పసుపు, కుంకుమతో నివేదనలు సమర్పించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారని, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహిస్తామని చెప్పారు.

■ అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. దాత గంటముక్కల ప్రభాకర్, బిందు పల్లవి దంపతుల సహకారంతో 200 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ చైర్మన్ నెరుసు భూషణం, ఈఓ కూచిపూడి శ్రీనివాస్ పర్యవేక్షించారు.